క్లుప్తంగా

సిద్ధార్థనగర్ లడ్డూకు రూ.60 వేలు



నర్సంపేట : గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నర్సంపేటలోని సిదార్థనగర్ లో శనివారం లడ్డూ వేలం వేశారు. నియోజక వర్గంలో అత్యధికంగా లడ్డూ వేలం రూ.60 వేలు పలికింది. పట్టణానికి చెందిన మట్ట మధుసూదన్‌రెడ్డి–పద్మ దంపతులు వేలంలో లడ్డూ కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ ఆకుల రవి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సింహరాములు, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సృజన, శోభారాణి, రజిత, సునీతాచారి, అర్చన, మాధవరావు, శ్రీకాంత్, వేణు, శ్రీనివాస్, డాక్టర్లు సంపత్, సాగర్ పాల్గొన్నారు.

నేడు కొమ్మాల ఆలయం మూసివేత

గీసుకొండ : చంద్ర గ్రహణం నేపథ్యంలో మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని నేడు (ఆదివారం) ఉదయం 11.30 గంటల నుంచి మూసి వేయనున్నట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఆలయాన్ని తిరిగి తెరువనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

‘యూరియా సరఫరాలో ప్రభుత్వాలు విఫలం’

పర్వతగిరి : రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చౌటపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంధం బాలరాజు విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా యూరియా అందించకుండా సర్దుకోమని చెప్పడం సరికాదన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సకాలంలో యూరియా అందించాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల కనీస అవగాహన లేదన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నివాళి



నర్సంపేట : ఎంసీపీఐ(యూ) మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర కమిటీ శాశ్వత ఆహ్వానితుడు విజయ్ శంకర్ ఝాకు ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. రాజస్తాన్ కోటా తల్వాండికి చెందిన విజయ్ శంకర్ మృతి చెందగా పట్టణంలోని ఓంకార్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, నాయకులు శనివారం పూలమాల వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, ఐక్య ప్రజా నాట్య మండలి, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శులు కన్నం వెంకన్న, రాగసుధ, నాయకులు కుసుంబ బాబురావు, కొమురయ్య, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని ఏకేతండాకు చెందిన హలావత్ నేజి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.3 వేల సాయం అందించారు. అలాగే రావులతండాకు చెందిన నేతావత్ మోహన్ అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా ఆయనకు కూడా రూ.3 వేలు అందించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల మధూకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఏకేతండా గ్రామ కమిటీ అధ్యక్షుడు హలావత్ రమేశ్, మాజీ ఉపసర్పంచ్ మూనావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపురం : మండలంలోని బాలుతండాకు చెందిన హౌంశ్య నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ శనివారం పరామర్శించారు. తొలుత హౌంశ్య నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. హౌంశ్య నాయక్ మృతి బాధాకరమని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రనాగుల మంగ్య నాయక్, లాలు, రాము, శంకర్, గోద్ర, వెంకన్న, హరి, తదితరులు పాల్గొన్నారు.

‘పత్తి’లో యాజమాన్యం తప్పనిసరి

● వ్యవసాయ శాఖ అధికారి ఎగిడి నాగరాజు



నెక్కొండ : పంట మార్పిడి చేయకుండా మళ్లీ మళ్లీ సాగు చేస్తే పంటకు జింకు, మెగ్నీషియం వంటి సూక్ష్మపోషకాల లోపం తప్పదు. ఈ క్రమంలో పంటల్లో జింకు, మెగ్నీషియం లోపాన్ని నివారించేందుకు రైతులు తెగుళ్లు, పోషకాల యాజమాన్య చర్యలు సకాలంలో చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎగిడి నాగరాజు సూచిస్తున్నారు. పత్తి పంటకు సోకే తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలు ఆయన వివరించారు.

పంట రక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అధిక తేమ వల్ల పత్తి వేర్లకు ప్రాణవాయువు అందక మొక్కలు నీరసించి పూత, గూడు రాలడం చోటు చేసుకుని కాయలు కుళ్లిపోతాయి. ఈ క్రమంలో 60–80 రోజుల వ్యవధిలో చేనులో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వీలైనంతగా భూమిలో తేమను తగ్గించడానికి అంతర సేద్యం చేయాలి. దీనితో పాటు ఎకరాకు 25 కిలోల చొప్పున యూరియా 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువు అందించాలి. అంతరకృషిలో ఆలస్యమైతే పంటకు నష్టం వాటిల్లడం ఖాయం. పత్తిని చీడపీడల్లో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తామర పురుగులు ఎక్కువగా ఆశి స్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మిల్లీ లీటర్లు లేదా ఎసిటామెప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాము కలిపి పిచికారీ చేయాలి. వర్షాలు భారీగా కురిస్తే బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఎక్కువ ఆశించి కాయలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. దీని నివారణకు 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, గ్రాము పోషామైసిన్ కలిపి పిచికారీ చేయాలి. వేరు కుల్లు, ఎండు



తెగుళ్లను పరిశీలిస్తున్న రైతులు, అధికారి (ఫైల్)

తెగుళ్లు ఆశిస్తే నివారణ దిశగా లీటరు నీటికి మూడు గ్రాములు చొప్పున కార్బండజిమ్ కలిపి మొక్కల మొదళ్లలో కలపాలి.

జింకు లోపం : జింక్ లోపం సోకిన పత్తి పంటలో మొక్క ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతాయి. చిన్నవిగా ముడతలు పడి కణువుల మధ్య ఎడం తగ్గుతుంది. మొక్కలు గిడసబారి పోతాయి.
నివారణ చర్యలు : లీటరు నీటిలో 2 గ్రాములు జింకు సల్ఫేట్ కలిపి ఐదు రోజులకోసారి చొప్పున రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి. అలాగే రెండేళ్లకోసారి ఎకరాకు 20 కిలోల చొప్పున జింక్ సల్ఫేట్ భూమిలో వేసి కలియదున్నాలి.
మెగ్నీషియం లోపం : మెగ్నీషియం ధాతువు లోపిస్తే ముదురు ఆకుల అంచులు పసుపు రంగులోకి మారుతాయి.. తరువాత ఆకులు ఎర్రబడి రాలిపోతాయి.
నివారణ చర్యలు : లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్ కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

అందరి సంక్షేమమే ధ్యేయం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మాధవరెడ్డి, నాయకులు

● నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి : నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరి సంక్షేమమే తన ధ్యేయమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా తాను పాలన సాగిస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని నాచినపల్లికి చెందిన మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఓరుగంటి కుమారస్వామి, నాయకుడు జటబోయిన స్వామి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో శనివారం చేరగా వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్రంలోని పేదలకు కనీస అవసరాలైన కూడు, గూడు, నీడ కల్పించేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, నాయకులు బొమ్మినేని భరత్‌రెడ్డి, వేముల రవీందర్‌రెడ్డి, జటబోయిన సురేశ్, నరేందర్, రాజేందర్, వనవాసం సాంబయ్య, జటబోయిన రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



సంగెం : ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంఈఓ రాము, తదితరులు

సంగెం : అజ్ఞానాన్ని పారద్రోలి విజ్ఞాన జ్యోతులు వెలిగించే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎంఈఓ రాము అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ)లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై న అంజీవర్ధన్‌రెడ్డి, కొమురయ్య, బాబురావు, వాసదేవరెడ్డి, రామచంద్రం, సుస్మిత, నీలిమ, విజయ, రవీందర్, కమరున్నీసా బేగం, రమాదేవి, భావన, కిశోర్, ప్రవీణ్‌కుమార్, జానా, సీఆర్‌పీలు శ్రీధర్, సరిత, మంజుల, కృష్ణలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాము మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ, నర్సింహస్వామి, సారంగపాణి, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా బోధించాలి



ఖానాపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీల్

ఖానాపురం : విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తరగతులు బోధించాలని ఉపాధ్యాయులకు ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఎంపీడీఓ అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే దిశగా ఉపాధ్యాయులు బోధనలో అవసరమైన మెళకువలు పాటించాలని సూచించారు. విలువలతో కూడిన విద్యాబోధన అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువుల మీదే ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, హెచ్ఎంలు ఆరిఫ్ హుస్సేన్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : కొత్తూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండలంలోని కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను, విద్యాశాఖ ఉద్యోగులను లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి వితోబా, పి సింగాచారి, క్లబ్ అధ్యక్షుడు బుద్ధ సునీల్‌కుమార్, సెక్రటరీ గారె నర్సయ్య, ట్రెజరర్ కంది ప్రభాకర్, సభ్యులు పోగులకొండ వేణు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులకు వెతలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట పీఏసీఎస్ వద్ద బారులు దీరిన రైతులు



దుగ్గొండి : గిర్నిబావిలో టోకెన్ల కోసం గుమిగూడిన రైతులు

నర్సంపేట రూరల్/దుగ్గొండి/పర్వతగిరి : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నర్సంపేట, దుగ్గొండి, పర్వతగిరి మండలాల్లో శనివారం యూరియా పంపిణీకి రైతులు పోటెత్తారు. వందల సంఖ్యలో పీఏసీఎస్‌లకు చేరుకుని యూరియా కోసం పోటీ పడ్డారు. ఆయా మండలాలకు 440 బస్తాల చొప్పున రాగా రైతులకు ఒకటి చొప్పున పోలీసుల పహారాలో అందించారు. దుగ్గొండి మండలంలో యూరియా పంపిణీని నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. రైతుల చేతుల్లో ఉన్న ఎరువుల పంపిణీ, పంట నమోదు కార్డులను తనిఖీ చేశారు.



దుగ్గొండి : రైతు కార్డును తనిఖీ చేస్తున్న ఏడీఏ

నర్సంపేటలో యూరియా తీసుకుని ఇక్కడకు యూరియా కోసం వచ్చిన రైతులను గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడి రైతులు అక్కడే యూరియా తీసుకోవాలన్నారు. అవసరం లేకున్నా యూరియా తీసుకుని ఇతర ప్రాంతాలకు పంపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



పర్వతగిరి : చౌటపల్లి పీఏసీఎస్ వద్ద..

ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన



సంగెం/దుగ్గొండి/రాయపర్తి/గీసుకొండ : రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు శనివారం ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించారు. ఈనెల 8న మండల పరిషత్ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓలు వెల్లడించారు. అభ్యంతరాలను పరిశీలించి 10న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు.

‘హక్కులను కాలరాస్తున్న కేంద్రం’

దుగ్గొండి : కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వ కాలరాస్తోందని బీఎస్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు బొళ్ల కొమురయ్య తెలిపారు. మండలంలోని మహ్మదాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల పోరాటాల ఫలితంగా ప్రమాద బీమా పెంపు సాధించుకున్నట్లు తెలిపారు. ఈనెల 9న వరంగల్‌లో నిర్వహించనున్న సభకు కార్మికులు తరలిరావాలని కోరారు.

పంటల్లో తెగుళ్ల నివారణ కీలకం

● శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ విజయభాస్కర్

పర్వతగిరి/సంగెం : పంటల్లో తెగుళ్ల నివారణ కీలకమని, తద్వారానే సరైన దిగుబడి సాధించగలరని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ విజయభాస్కర్ తెలిపారు. పర్వతగిరి మండలంలోని కొంకపాక, సంగెం మండలంలోని షాపూర్‌లో శాస్త్రవేత్తల బృందం శనివారం సందర్శించి పత్తి, వరి, మొక్కజొన్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ సందర్భంగా విజయభాస్కర్ రైతులకు సూచనలు అందించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తి పంటలో వడలు తెగులు నివారణ కోసం 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణ కోసం 1500 పీపీఎం వేప నూనె ఎకరాలకు లీటర్ చొప్పున లేదా 300 గ్రాముల అసిఫేట్ లేదా 0,25 మిల్లీలీటర్ల ఫ్లునికామైడ్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 80 గ్రాములు చొప్పున ఎమమెక్టిన్ బెంజోయేట్ మందు మొవ్విలో పడేలా చల్లాలని చెప్పారు. ఆకుమాడు తెగులు నివారణకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రాపికోనజోల్ మందు పిచికారీ చేయాలని తెలిపారు. వరి సాగులో ఆలస్యం జరిగితే కలుపు యాజమాన్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చాలా రోజులపాటు నీరు నిల్వ ఉన్న వరి పొలాల్లో సల్ఫైడ్ ఇంజురీ వల్ల వేర్లు కుళ్లిపోతున్న క్రమంలో వెంటనే నీరు తీసేసి పొలాలను ఆరబెట్టాలన్నారు. అధిక వర్షాల నేపథ్యంలో పసుపు పంటలో దుంప కుళ్లు నివారణకు మొక్క మొదట్లో వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుని మెటల్ ఆక్సిల్, మాంకోజెబ్ కలిగిన మందు 2.5 గ్రాములు లీటరు నీటికి కలుపి మొదలు తడిచేలా పిచికారీ చేయాల్సి ఉంటుందని వివరించారు. దుంప పుచ్చు ఆశించకుండా దుంప ఈగ నివారణకు కార్బో ఫ్యూరాన్ 3 సిజి గుళికలను ఎకరాకు 8–10 కిలోల చొప్పున ఇసుకలో కలుపుకొని పొలమంతా చల్లాలని తెలిపారు. పొటాష్ లోపాన్ని నివారించే దిశగా లీటరు నీటిలో 5 గ్రాముల 13–0–45 కలిపి ఆకులపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.విశ్వతేజ, డాక్టర్.శుష్మ, డాక్టర్ డి.వీరన్న, మండల వ్యవసాయ అధికారులు ప్రశాంత్‌కుమార్, సాగరిక, ఏఈఓలు కార్తీక్, సరిత తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు

● మాజీ సర్పంచ్‌లు గోనె శ్రీదేవి, చంద్రమౌళి

నల్లబెల్లి : ఉపాధ్యాయులను సమాజ మార్గదర్శకులుగా మండలంలోని నాగరాజుపల్లి, మామిండ్లవీరయ్యపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు గోనె శ్రీదేవి, ఆసం చంద్రమౌళి అభివర్ణించారు. పంతులుపల్లి ప్రైమరీ, శనిగరం హైస్కూళ్లలో శనివారం గురుపూజోత్సవాలు నిర్వహించారు. భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి శ్రీదేవి, చంద్రమౌళి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, చంద్రమౌళి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేస్తున్నారని అభినందించారు. పేదలు పిల్లలను లక్షలు ఖర్చు పెట్టి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించే స్థితిలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్యాబోధన అందాలని ఆకాంక్షించారు. శనిగరం హైస్కూల్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హెచ్ఎం ఫ్రాన్సిస్ జేవియర్ బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమాల్లో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కర్ణకంటి రామ్మూర్తి, ఉపాధ్యాయులు కూనమల్ల రాజన్ బాబు, నటరాజన్, శ్రీనివాస్, సుశీల, మంజుల, సుధారాణి, రవూఫ్, వెంకట్రాం నర్సయ్య, శ్రీలత, సుల్తానా, సంధ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్‌లు

కేసీఆర్ కుటుంబాన్ని బహిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

● మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య

వర్ధన్నపేట : మాజీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ మైస సురేశ్ కోరారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుతిన్నదని ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం చేసిన పాపాలు ఎమ్మెల్సీ కవిత రూపంలో బయట పడుతున్నాయని తెలిపారు. ప్రజాధనాన్ని దోచుకున్నారని, బీఆర్ఎస్ నేతలు ప్రతి పైసా కక్కాల్సిందేనని అన్నారు. సీబీఐ విచారణను ఎదుర్కోవాలంటే బీజేపీతో సఖ్యతగా ఉండాలన్న ఆలోచనతోనే ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని అభిప్రాయం వ్యక్తం చేశారు. వాటాల పంపకాల్లో తేడాల వల్లే కవిత బయటకు వచ్చి మాట్లాడుతోందన్నారు. అవినీతిపరుల వెనుక ఉండాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు పోశాల వెంకన్న, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మరుపట్ల అరుణ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ తూళ్ల రవి, నాయకులు భీమా నాయక్, చీటూరి రాజు, భాస్కర్, రవీందర్‌రెడ్డి, సతీశ్, అక్బర్, యాదగిరి, సాయికుమార్, అశోక్, చిన్న రాజు, శివ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న ఎల్లస్వామి, తదితరులు

నల్లబెల్లి: మండలంలోని రేలకుంటలో దళిత, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని పులిశేరు ఎల్లస్వామి కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సలీంకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎల్లస్వామి మాట్లాడారు. రేలకుంట శివారు సర్వే నంబర్ 322, 324ల్లోని 10 గుంటల భూమిని 2014లో భూదాన్ బోర్డు తమ కుటుంబాలకు దానం చేసిందన్నారు. సదరు భూములను సిద్ధూరి తిరుపతిరావు, ఎర్రబెల్లి రఘుపతిరావు, ఎర్రగట్టు రమేశ్ ఆక్రమించుకోవడానికి యత్నిస్తున్నారని చెప్పారు. తమ పందుల గుడిసెలను తొలగించి తమ ఉపాధి దెబ్బతీయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయపురి నీల, కూరాకుల రాజు, దుగ్యాల పోశాలు పాల్గొన్నారు.

కేఎంటీపీలో పర్యటించిన ఎంసీపీఐ బృందం

గీసుకొండ : గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును (కేఎంటీపీ) ఎంసీపీఐ రాష్ట్ర నాయకుడు మోర్తాల చందర్‌రావు ఆధ్వర్యంలోని బృందం శనివారం సందర్శించింది. వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి దారం, ఇతర వస్తువులను తయారు చేసే గణేశా ఎకోటెక్ కంపెనీలో ఉత్పత్తి ప్రక్రియను నాయకులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్మికుల వేతనాలు, వారికి కల్పిస్తున్న వసతుల, సదుపాయాలు, తదితరాలపై కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఎంసీపీఐ బృందానికి కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కెఎస్.రెడ్డి, ఎండీ మురళీధర్, హెచ్ఆర్ అధికారి రమేశ్ పలు వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సింగతి సాంబయ్య, పానుగంటి నర్సయ్య, మాడిశెట్టి అరుణ్ కుమార్, మాదం తిరుపతి, తాటికొండ రవి, రాజేశ్ నాయక్, బల్బుకూరి నర్సయ్య, బాషిపాక రమేశ్, సంపత్, గోనె కుమారస్వామి, మోర్తాల రవీందర్, పెంతల రాజు, గోనె లింగమూర్తి, మోర్తాల సారంగం, బిట్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయము - వరంగల్ జిల్లా

తేది: 06-09-2025

టెండర్ ప్రకటన

వరంగల్ జిల్లాలోని 32 ప్రీప్రైమరీ పాఠశాలలలో ఫర్నీచర్, ఇండోర్ మరియు అవుట్‌డోర్ ప్లే మెటీరియల్ సరఫరా చేయుటకు గాను సీల్డ్ టెండర్లను కోరబడుచున్నవి. ఆసక్తి గల సరఫరాదారులు జిల్లా విద్యాశాఖాధికారి, వరంగల్ పేరున ఏదైనా జాతీయ బ్యాంకు ద్వారా తీసినటువంటి **రూ.5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు)** డి.డి.ని సమర్పించి జిల్లా విద్యాశాఖాధికారి గారి కార్యాలయం వరంగల్ నుండి టెండర్ ఫారంను పొందవచ్చును.

టెండర్ ఫారంను **తేది: 08-09-2025 నుండి 15-09-2025 మధ్యాహ్నం 12-00 గంటల వరకు** పొందవచ్చును. సీల్డ్ టెండర్ ఫారంను **తేది: 15-09-2025 మధ్యాహ్నం 03-00 గంటల లోపు** జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వరంగల్ నందు సమర్పించవలెను మరియు **రూ. 4,80,000/- (అక్షరాల నాలుగు లక్షల ఎనభై వేల రూపాయలు)** EMD ని జిల్లా విద్యాశాఖాధికారి వరంగల్ పేరున ఏదైనా జాతీయ బ్యాంకు ద్వారా తీసి టెండర్‌లో పాల్గొనగలరు.

సీల్డ్ టెండర్లను **తేది: 15-09-2025 (అదేరోజు)** సాయంత్రం 5-00 గంటలకు జిల్లా కలెక్టర్ వరంగల్ గారి కార్యాలయంలో తెరవబడును. ఇతర వివరాల కొరకు విద్యాశాఖాధికారి అధికారి కార్యాలయం వరంగల్‌లో సంప్రదించగలరు.

సం/- **జిల్లా విద్యాశాఖాధికారి,** వరంగల్